అక్షర దర్బార్


www.aksharadarbar.com

Voice of the people


# మీసేవ కేంద్రాల్లో యూరియా బుకింగ్


- రూ.10 సేవా రుసుముతో ముందస్తు బుకింగ్ సదుపాయం
- ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్

అక్షరదర్బార్, భూపాలపల్లి: రైతులకు అవసరమైన యూరియా ఎరువులను సకాలంలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మీ సేవా కేంద్రాల ద్వారా యూరియా బుకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు భూపాలపల్లి జిల్లా ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. రైతులు తమ సమీప మీ సేవా కేంద్రాల్లో ముందస్తుగా యూరియాను బుక్ చేసుకోవాలని సూచించారు. యూరియా బుకింగ్ కోసం పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ వివరాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. పోడు పట్టాలు కలిగిన రైతులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.10 సేవా రుసుము చెల్లించి బుకింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు. మొబైల్ నంబర్ మార్పు, కౌలు రైతుల నమోదు కోసం సంబంధిత రైతు వేదిక లోని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని తెలిపారు.




శుక్రవారం 10, జూలై 2026 | సంపుటి :03 | సంచిక :144 | పేజీలు :05 | వెల ₹5


- విలువలు తెలిసిన వాడైతే రాజీనామా చేసి మళ్లీ గెలవాలన్న మంత్రి
- బిడ్డను కాంగ్రెస్ నుంచి గెలిపిస్తవు.. నీవేమో బీఆర్ఎస్ ఎమ్మెల్యేను అంటావని విమర్శ
- తప్పు ఒప్పుకోవాల్సింది పోయి ఎదురుదాడికి దిగటమా?
- తాడోపేడో తెల్చుకుంటానన్న కొండా సురేఖ
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ కు ఫిర్యాదు
- హాట్ టాపిక్ గా తాజా వరస పరిణామాలు



# ముదురుతున్న వివాదం

## కొండా సురేఖ వర్సెస్ కడియం శ్రీహరి

ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో గత కొంతకాలంగా అంతర్గతంగా సాగుతున్న ఆధిపత్య పోరు ఇప్పుడు బహిర్గతమై వీధిన పడింది. రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిల మధ్య రేగిన వివాదం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో తీవ్ర సంచలనంగా మారింది. దేవాదాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిర్వహించిన సమీక్షా సమావేశం ఈ అగ్నికి ఆజ్యం పోసింది. నిన్నటి వరకు పరోక్ష విమర్శలకే పరిమితమైన ఈ ఇద్దరు సీనియర్ నేతల వ్యవహారం.. ఇప్పుడు ఏకంగా పీసీసీ వేదికగా పంచాయితీకి దారితీసింది. కడియం శ్రీహరి తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న మంత్రి కొండా సురేఖ.. నేరుగా గాంధీభవన్‌కు వెళ్లి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం పార్టీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఒకే గూటికి చేరిన ఈ ఇద్దరు ఉద్దండుల మధ్య సయోధ్య కుదర్చడం ఇప్పుడు అధిష్ఠానానికి పెద్ద తలనొప్పిగా మారేలా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఒకరి నైతికతను మరొకరు ప్రశ్నిస్తూ సవాళ్లు విసురుకుంటున్న తరుణంలో.. వరంగల్ గులాబీ కోటలో రేగిన ఈ కాంగ్రెస్ గ్రూపు రాజకీయం ఎటు దారితీస్తుందనేది రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.

– అక్షర దర్బార్, వరంగల్

05



# సీపీని కలిసిన నాయిని

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్ శ్వేతను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు నూతన కమిషనర్‌కు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై కమిషనరేట్ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో ఎన్ శ్వేత విజయవంతంగా సేవలందించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అభిలషించారు.

- ప్రతి రంగంలో నాణ్యత, పారదర్శకత, సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- వరంగల్, హనుమకొండ జిల్లాల అధికారులతో విస్తృత సమీక్ష
- హాస్టళ్ల మౌలిక వసతులకు ప్రతి జిల్లాకు రూ. కోటి మంజూరు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




# లబ్ధిదారులకే నేరుగా పథకాల ఫలాలు అందాలి

04

# ఎస్పీని కలిసిన జర్నలిస్టులు

- వార్తలపై నోటీసుల అంశాన్ని దృష్టికి తీసుకెళ్లిన ప్రతినిధులు
- సానుకూలంగా స్పందించిన ఎస్పీ రామ్ నాథ్ కేకన్



అక్షరదర్బార్, ములుగు: ములుగు జిల్లా ఎస్పీ రామ్ నాథ్ కేకన్ ను ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన జర్నలిస్టులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వార్తల ప్రచురణకు సంబంధించి పోలీసులు జర్నలిస్టులకు నోటీసులు జారీ చేసిన అంశాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టులు తమకు ఎదురైన పరిస్థితులను ఎస్పీకి వివరించారు. వార్తలు రాస్తే నోటీసుల ఇచ్చి భయభ్రాంతులకు గురి చేయొద్దని కోరారు. ఈ అంశంపై ఎస్పీ రామ్ నాథ్ కేకన్ సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తానని చెప్పారు. ఎస్పీని కలిసిన వారిలో సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, ఊటుకూరి సాయిరాం, కంకణాల సంతోష్, బూరం ప్రశాంత్, అనిల్, బొక్క దయాసాగర్, టీవీ రాజు, వంశీ మోహన్, హరికృష్ణ, మోహన్ రావు, అరెల్లి కిరణ్, దాసరి ధనుంజయ, పల్లెబోయిన నాగరాజు, సలేంద్ర రవీందర్, నరేశ్ గౌడ్, సందీప్, శ్రీకాంత్, ములుగు జిల్లాకు చెందిన రిపోర్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి ఆట్యా-పాట్యా పోటీలకు గీతాంజలి స్కూల్ విద్యార్థులు

అక్షరదర్బార్, నర్సంపేట : రాష్ట్రస్థాయి ఆట్యా-పాట్యా పోటీలకు నర్సంపేట పట్టణంలోని గీతాంజలి డిజి స్కూల్ విద్యార్థులు కొండ రితిక్ చంద్, ఇల్లందుల ధనుష్ ఎంపికయ్యారు. నర్సంపేట మినీ స్టేడియంలో వరంగల్ జిల్లా ఆట్యా పాట్యా అసోసియేషన్ నిర్వహించిన అండర్-14 క్రీడా సెలక్షన్స్‌లో వీరు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సింహాద్రి, పీఈటీలు యాట రవికుమార్, వర్స అఖిల, రజిని కుమార్ పాల్గొన్నారు.

## నర్సంపేటలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలి

- ఏఐఎఫ్డీఎస్

అక్షరదర్బార్, నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ఏఐఎఫ్డీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు జన్ను రమేష్ డిమాండ్ చేశారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిసి ప్రభుత్వ విద్యా రంగ సమస్యల వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, జూనియర్, డిగ్రీ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మార్తా నాగరాజ్, నాయకులు కల్లెపెల్లి రాకేష్, బన్నీ పాల్గొన్నారు.



# నిబంధనల ప్రకారమే 16వ ఆర్థిక సంఘం నిధులు వాడాలి

- అవగాహన లోపంతో నిబంధనలు ఉల్లంఘిస్తే ఇబ్బందులు తప్పవు
- పన్నుల వసూళ్లతో గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలి
- ప్రణాళికాబద్ధమైన పాలనతోనే గ్రామాభివృద్ధి సాధ్యం: మంత్రి సీతక్క




అక్షరదర్బార్, ములుగు : గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలని, ప్రణాళికాబద్ధమైన పాలనతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. గ్రామ పంచాయతీలను బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే లక్ష్యంతో గురువారం ములుగు లీలా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన 'గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక – సర్పంచుల శిక్షణ' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు గ్రామ పాలన, చట్టాలు, ఆర్థిక నిబంధనలపై పూర్తి అవగాహనతో పనిచేయాలని మంత్రి సూచించారు. గ్రామాభివృద్ధి పనులు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వార్షిక కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) ఆధారంగానే చేపట్టాలన్నారు.

### ఆర్థిక క్రమశిక్షణ అవసరం..

16వ ఆర్థిక సంఘం నిధులు అమల్లోకి వస్తున్న తరుణంలో ప్రతి సర్పంచ్ నిధుల మార్గదర్శకాలను పూర్తిగా తెలుసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. గతంలో అవగాహన లోపంతో కొందరు సర్పంచులు నిబంధనలకు విరుద్ధంగా నిధులు వినియోగించి ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. టైడ్, అన్‌టైడ్ ఫండ్స్, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులకు ఉండే ప్రత్యేక నిబంధనల ప్రకారమే ఖర్చు చేయాలన్నారు. పంచాయతీల సొంత ఆదాయాన్ని పెంపొందించేందుకు పన్నులు, ఫీజుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

### మౌలిక వసతులకు ప్రాధాన్యం..

జీపీ-సాప్ (జీపీ–ఎస్డీపీ) ద్వారా గ్రామ అవసరాలను గుర్తించి తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, హరితహారం, గ్రామ రహదారులు, మురుగు నీటి పారుదల మరియు ప్రజా ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి పనిని నాణ్యతతో, పారదర్శకంగా, ప్రజలకు జవాబుదారీతనంతో అమలు చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, వైస్ చైర్మన్ సారంగం, డీపీఓ వెంకయ్య, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు పాల్గొన్నారు.


## ఉపసర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా గడ్డం రాజు ఏకగ్రీవం




అక్షరదర్బార్, శాయంపేట : ఉపసర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజుపల్లి గ్రామ ఉపసర్పంచ్ గడ్డం రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రాజును రాజుపల్లి సర్పంచ్ మలసాని లక్ష్మణరావు, నాయకులు గజ్జెల రాజు, సిద్దూరి మధుకర్ రావు, మలసాని తిరుపతిరావు, గడ్డం రమేష్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఉపసర్పంచుల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు.

# ముత్తోజిపేట వద్ద ట్రాలీ బోల్తా

### ఒకరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు



అక్షరదర్బార్, నర్సంపేట : నర్సంపేట మున్సిపాలిటీ శివారు ముత్తోజిపేట గ్రామం వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సూర్యాపేట జిల్లా వేములపల్లి నుండి ములుగు జిల్లా మేడారానికి 23 మంది ప్రయాణికులతో వెళ్తున్న అశోక్ లేలాండ్ ట్రాలీ వెనుక టైర్ ఒక్కసారిగా పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చీముల అంజయ్య అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన నలుగురిని చికిత్స కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నర్సంపేట ఎస్సై గూడ అరుణ్ కుమార్ తెలిపారు.

## చిట్యాలలో ఘనంగా ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవం




అక్షరదర్బార్, చిట్యాల : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) చిట్యాల శాఖ ఆధ్వర్యంలో గురువారం సంఘం 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల హాస్టల్స్ సెక్రటరీ బుర్ర అభిజ్ఞ ఏబీవీపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 1949 జూలై 9న కేవలం ఐదుగురితో ప్రారంభమైన ఏబీవీపీ, నేడు దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా అవతరించిందని కొనియాడారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ఏబీవీపీ ప్రధాన లక్ష్యమన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బుర్ర నాగరాజు, సాయి, బన్నీ పాల్గొన్నారు.

# ములుగులో సీఆర్ఐ పంప్స్ నూతన బ్రాంచ్ ప్రారంభం

### రైతులకు అందుబాటులోకి అత్యాధునిక సాంకేతిక ఉత్పత్తులు



అక్షరదర్బార్, ములుగు: రైతులు, వినియోగదారులకు నాణ్యమైన నీటి పంపింగ్ పరిష్కారాలను చేరువ చేసేందుకు ప్రముఖ సీఆర్ఐ పంప్స్ సంస్థ ములుగు జిల్లా కేంద్రంలో నూతన బ్రాంచ్‌ను గురువారం ప్రారంభించింది. సీఆర్ఐ పంప్స్ సౌత్ ఇండియా జనరల్ మేనేజర్ మధుసూదన్, సికింద్రాబాద్ బ్రాంచ్ మేనేజర్ కీర్తి శ్రీనివాస్, స్వామిరెడ్డి, సురేందర్ రెడ్డి సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ఈ బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ వ్యవసాయ, గృహ, పారిశ్రామిక అవసరాలకు అనువైన సబ్‌మర్సిబుల్ పంపులు, మోనోబ్లాక్ పంపులు, బోర్‌వెల్ పంపులు, ఎలక్ట్రిక్ మోటార్లు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. ములుగు జిల్లాలో ఈ బ్రాంచ్ ఏర్పాటుతో రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు, సాంకేతిక సలహాలు, విడిభాగాలు సమీపంలోనే వేగంగా లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యాపారవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

# శాయంపేట చేనేత సంఘం చైర్మన్‌గా కందగట్ల పరమాత్మ

అక్షరదర్బార్, శాయంపేట : శాయంపేట నవారు షతరంజి చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘం పాలకవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. సంఘం అధ్యక్షుడిగా కందగట్ల పరమాత్మ, ఉపాధ్యక్షుడిగా కందగట్ల రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శిగా గుర్రపు భాగ్యలక్షి , కోశాధికారిగా కందగట్ల వేణు ఎన్నిక కాగా, డైరెక్టర్లుగా కుసుమ రమేష్, కందగట్ల హరికృష్ణ, గుర్రపు కుమారస్వామి, దుంపేటి రమేష్, ఎండీ అంకుశావళి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రవీంద్ర వెల్లడించారు.



# సీఎస్ఐ బీజేఎం హైస్కూల్‌లో డిజిటల్ క్లాస్ రూమ్ ప్రారంభం

అక్షరదర్బార్, శాయంపేట : శాయంపేట మండలం కాట్రపల్లి గ్రామంలోని సీఎస్ఐ బీజేఎం ఉన్నత పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూమ్‌ను మిషనరీ ఇంచార్జ్ రెవరెండ్ జూన్ చెరియన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడమే ఈ డిజిటల్ క్లాస్ రూమ్ ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యార్థులు ఈ ఆధునిక వసతిని సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రాజు నాయక్, సెక్రటరీ రాజన్న, ఉపాధ్యాయురాలు ప్రవళిక పాల్గొన్నారు.





# బాలసదనంలో చిన్నారుల మధ్య మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు

○ కేక్ కట్ చేసిన మంత్రి.. స్కూల్ బ్యాగులు, పుస్తకాల పంపిణీ

అక్షరదర్బార్, ములుగు : రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క జన్మదిన వేడుకలను ములుగు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలసదనంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క బాలసదనంలోని చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య పుట్టినరోజు జరుపుకున్నారు. అనంతరం తన జన్మదినాన్ని పురస్కరించుకుని అక్కడి చిన్నారులకు పాఠశాల బ్యాగులు, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఈ.పి. ప్రేమలత, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, మంత్రి లక్ష్మణ్ ను కలిసిన ఎమ్మెల్యే రేవూరి

హనుమకొండ జిల్లా పర్యటనకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి వరంగల్ ఎన్ఐటీ అతిథి గృహంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్, మంత్రిలకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం పరకాల నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వారితో సంక్షిప్తంగా చర్చించారు.

– అక్షరదర్బార్, పరకాల

# ముగిసిన జోనల్ పోలీస్ డ్యూటీ మీట్



అక్షరదర్బార్, మామునూరు: మూడు రోజుల పాటు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మామూనూరు పోలీస్ శిక్షణ కేంద్రంలో జరిగిన భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ గురువారం ఘనంగా ముగిశాయి. ఈ డ్యూటీ మీట్‌లో జోనల్ పరిధిలో వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లతో పాటు, మహబుబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్ లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ప్రోపెషన్ ఫోటో, వీడియోగ్రాఫీల్లో విభాగాల్లో పోటీపడ్డారు. ఇందులో ప్రతిభ కనబరిచన పోలీస్ అధికారులకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత అధికారుల చేతుల మీదుగా పతాకాలను అందజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ విభాగం 13 గోల్డ్ మెడల్స్ సహా మొత్తం 28 పతకాలను సాధించారు. భద్రాద్రి కొత్తగూడెం 12, మహబూబాబాద్ జిల్లాకు 13, ఖమ్మం 9 పతకాలను సాధించారు. ఇందులో రాణించిన పోలీస్ అధికారులు త్వరలో మల్కాజిగిరి కమిషనరేట్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొంటారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఇలాంటి డ్యూటీ మీట్‌ల ద్వారా వృత్తి నైపుణ్యాన్ని సాధించవచ్చని, కఠోర సాధన చేస్తే వృత్తి నైపుణ్యంతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ కబరచవచ్చని, ముఖ్యంగా వృత్తి నైపుణ్యం సాధించడం ద్వారా విధి నిర్వహణలో ఎదురయ్యే పని ఒత్తిళ్ళ అదిగమించవచ్చని అన్నారు. జోనల్ స్థాయిలో కబరిచిన ప్రతిభనే రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలని సీపీ అధికారులకు సూచించారు. విజయవంతంగా ఈ పోటీలను ముగించడంలో కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు శ్రీనివాస్, బాలస్వామి, ఏసీపీలు, సురేంద్ర, డీఎస్పీలు శ్రీనివాస్, సాంబరాజు, ఆర్ఐలు సతీష్ , ఇన్ స్పెక్టర్లు క్రాంతి కుమార్, విశ్వేశ్వర్, ఎస్ఐ విజయ్ కుమార్, ఆర్ఎస్ఐ శ్రవణ్ కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## లబ్ధిదారులకే నేరుగా పథకాల ఫలాలు అందాలి

- ప్రతి రంగంలో నాణ్యత, పారదర్శకత, సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- వరంగల్, హనుమకొండ జిల్లాల అధికారులతో విస్తృత సమీక్ష
- హాస్టళ్ల మౌలిక వసతులకు ప్రతి జిల్లాకు రూ. కోటి మంజూరు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

అక్షరదర్బార్, హనుమకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, వాటి ప్రయోజనాలు సమాజంలోని చివరి లబ్ధిదారుని వరకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికారులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రగతిపై గవర్నర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన, వందేమాతరం, తెలంగాణ రాష్ట్ర గీతాలాపనతో ప్రారంభమైన ఈ సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్. నాగరాజు, కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, వరంగల్ సీపీ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

**పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రగతి వివరణ**

సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల చారిత్రక నేపథ్యం, అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, వైద్య–ఆరోగ్య సేవలు, వ్యవసాయం, మౌలిక వసతులపై కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను సీపీ శ్వేత వివరించారు. టీబీ ముక్త్ భారత్, పల్స్ పోలియో, గృహ నిర్మాణంపై గవర్నర్ సమీక్ష జరిపారు. వ్యవసాయం, ఏఐ సాంకేతికతపై ఆయన కీలక సూచనలు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పత్తి సాగుకు ప్రసిద్ధి చెందినందున, రైతులను అధిక ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటలు, విలువ ఆధారిత వ్యవసాయం వైపు మళ్లించాలని అన్నారు. ప్రస్తుతం ప్రపంచం ఏఐ యుగంలోకి అడుగుపెట్టిందని, దీనికి భయపడాల్సిన అవసరం లేదని గవర్నర్ పేర్కొన్నారు. ఏఐని మనిషే సృష్టించాడని గుర్తుంచుకుని, పరిపాలనలో సేవలను మరింత వేగంగా, నాణ్యంగా అందించేందుకు దీన్ని ఒక సమర్థవంతమైన సాధనంగా వాడుకోవాలని సూచించారు.

**సంక్షేమ హాస్టళ్లకు రూ. కోటి చొప్పున ప్రత్యేక నిధులు**

ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సంక్షేమ హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. "హాస్టళ్లలో చదువుతున్న ప్రతి విద్యార్థి భద్రత, ఆరోగ్యం, విద్యా ప్రగతి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం" అని మంత్రి స్పష్టం చేశారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలను అన్ని రంగాల్లో ఆదర్శ జిల్లాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హనుమకొండ అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి, వరంగల్ డీసీపీ ధారా కవిత, రెండు జిల్లాలకు చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆ చైర్మన్ ఎవరు..?

- 'డైరెక్టర్లు మీ ఇష్టం.. చైర్మన్ మాత్రం నా ఇష్టం'
- పరకాల, మాదారం పీఏసీఎస్‌లపై కాంగ్రెస్‌లో అంతర్మథనం
- ఉత్కంఠ రేపుతున్న ముఖ్య ప్రజాప్రతినిధి వ్యాఖ్యలు
- సందిగ్ధంలో ఆశావహులు



అక్షరదర్బార్, పరకాల : పరకాల నియోజక వర్గంలోని పరకాల, మాదారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) చైర్మన్ పదవుల ఎంపిక అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇన్నాళ్లుగా చైర్మన్ పీఠం తమకే దక్కుతుందని ధీమాలో ఉన్న పలువురు సీనియర్ నాయకులకు, తాజా రాజకీయ పరిణామాలు గట్టి నిరాశనే మిగిల్చినట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

**- ఆయన వ్యాఖ్యలతో మారిన సీన్**

ఇటీవల పీఏసీఎస్ డైరెక్టర్ల ఎంపికపై నిర్వహించిన ఒక ముఖ్య సమావేశంలో స్థానిక ముఖ్య ప్రజాప్రతినిధి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో హాట్ టాపిక్‌గా మారాయి. "డైరెక్టర్లను మీరు ఎంపిక చేసుకోండి.. చైర్మన్‌ను మాత్రం నేనే నిర్ణయిస్తాను" అని సమావేశంలో అన్నట్లుగా ప్రచారంలో ఉంది. ముఖ్య ప్రజాప్రతినిధి నుంచి వచ్చిన ఈ ఒక్క ప్రకటనతో, చైర్మన్ పదవిపై భారీగా ఆశలు పెట్టుకున్న కీలక నేతలు ఒక్కసారిగా అయోమయంలో పడ్డారు. డైరెక్టర్ల వరకు స్థానిక సమీకరణాలు చూసుకున్నా, బాస్ సీటు మాత్రం అధిష్ఠానం (ముఖ్య ప్రజాప్రతినిధి) చేతుల్లోనే ఉండటంతో ఆశావహుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

**తారుమారైన అంచనాలు..**

గత కొంతకాలంగా ప్రచారంలో ఉన్న సమీకరణాల ప్రకారం.. పరకాల పీఏసీఎస్ కు ఇక్కడి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక సీనియర్ నాయకుడికి చైర్మన్ అవకాశం వస్తుందని భావించారు. మాదారం సొసైటీకి.. నడికూడ ప్రాంతానికి చెందిన మరో సీనియర్ నాయకుడి పేరు దాదాపు ఖరారైందనే టాక్ నడిచింది. అయితే, ముఖ్య ప్రజాప్రతినిధి తాజా నిర్ణయంతో పాత సమీకరణాలన్నీ తారుమారయ్యాయని పార్టీ అంతర్గత వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. తాము అనుకున్న వ్యూహాలు ఫలించకపోవడంతో సీనియర్లు ఇప్పుడు డైరెక్టర్ పదవికి పోటీ చేయాలా? లేక చైర్మన్ రేసు కోసం వేచి చూడాలా? అనే సందిగ్ధంలో పడిపోయారు.

**మరో రెండు రోజుల్లో క్లారిటీ**

మరో రెండు రోజుల్లో పరకాల, మాదారం పీఏసీఎస్ చైర్మన్ల పేర్లను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందన్న ప్రచారం జోరందుకుంది. మరి ఈ ఉత్కంఠకు తెర దించుతూ ముఖ్య ప్రజాప్రతినిధి మనసులో ఉన్న ఆ 'ఆ ఇద్దరు' లక్కీ లీడర్లు ఎవరు? ఆ చైర్మన్ పదవులు ఎవరిని వరించనున్నాయి? అనేది ఇప్పుడు నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణుల్లో అత్యంత ఆసక్తికరంగా మారింది.

# ఐటీ ఉద్యోగాల పేరిట కార్ల దగా

- వరంగల్‌లో ఇద్దరు కేటుగాళ్ల అరెస్ట్, 3 కార్ల స్వాధీనం
- నెలవారీ అద్దె ఆశ చూపి కార్లు తీసుకుని, ఇతరుల వద్ద తాకట్టు పెట్టిన ముఠా



అక్షరదర్బార్, వరంగల్: ఐటీ కంపెనీల్లో కార్లు అటాచ్‌మెంట్ ఇప్పిస్తామని, నెలనెలా వేల రూపాయల అద్దె ఇప్పిస్తామని నమ్మించి వాహన యజమానులను నిలువునా ముంచేస్తున్న ఇద్దరు కేటుగాళ్లను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఏజే మిల్స్ కాలనీ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ. లక్షల విలువైన మూడు కార్లు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

**నెలకు రూ. 35 వేల అద్దె అంటూ నమ్మించి...**

పోలీసుల కథనం ప్రకారం.. మొహమ్మద్ సోహైల్ అనే బాధితుడికి చెందిన మారుతి డిజైర్ కారును ఐటీ కంపెనీలో పెడతామని, నెలకు రూ. 35 వేల అద్దె వస్తుందని ప్రధాన నిందితుడు సింగారపు శ్యామ్ కుమార్ నమ్మించాడు. మొదట నమ్మకం కోసం రూ. 35 వేలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. ఆ తర్వాత సదరు వాహనాన్ని యజమానికి తెలియకుండా ఇతరుల వద్ద తాకట్టు పెట్టి రూ.లక్షలు కాజేశాడు. ఆ తర్వాత అద్దె చెల్లించకుండా మొహం చాటేయడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దర్యాప్తులో నిందితుడు ఇదే తరహాలో మరికొంతమంది వాహన యజమానులను కూడా మోసం చేసినట్లు వెల్లడైంది.

**- వాహన తనిఖీల్లో దొరికిన నిందితులు**

గురువారం తెలంగాణ జంక్షన్ వద్ద ఏజే మిల్స్ కాలనీ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న సింగారపు శ్యామ్ కుమార్, ఎండీ సోహైల్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీస్ శైలిలో విచారించగా తాము చేసిన మోసాలను అంగీకరించారు.

**- మూడు కార్ల స్వాధీనం**

నిందితుల నుంచి ప్రస్తుతం ప్రయాణిస్తున్న మారుతి డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిచ్చిన సమాచారంతో చింతల్ ఫ్లైఓవర్ కింద దాచి పెట్టిన మరో రెండు విలాసవంతమైన కార్లను (మారుతి ఎర్టిగా, మారుతి బలెనో) మరియు నేరాలకు ఉపయోగించిన ఒక హెచ్‌ఎమ్‌డీ కీప్యాడ్ మొబైల్ ఫోన్‌ను పోలీసులు రికవరీ చేశారు.

**- పాత నేరస్తుడే.. దర్యాప్తు ముమ్మరం**

ప్రధాన నిందితుడు సింగారపు శ్యామ్ కుమార్ గతంలోనూ ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఇతనిపై ఇప్పటికే చెన్నారావుపేట, ఇంతేజార్‌గంజ్, ఏజే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నాయి. ఈ ముఠాలో పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని పోలీసులు వెల్లడించారు. ఇతర బాధితుల వివరాలు, డిజిటల్, ఆర్థిక ఆధారాల సేకరణపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. అరెస్టయిన ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపరిచి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఏజే మిల్స్ కాలనీ పోలీసులు పేర్కొన్నారు.


# భద్రకాళిని దర్శించుకున్న గవర్నర్ దంపతులు

అక్షరదర్బార్, హనుమకొండ: రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా దంపతులు గురువారం హనుమకొండలోని ప్రసిద్ధ శ్రీ భద్రకాళి అమ్మవారి దేవస్థానాన్ని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న గవర్నర్ దంపతులకు రాష్ట్ర దేవాదాయ శాఖ సంచాలకులు ఎం హనుమంతరావు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతంతో వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులు ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సుభిక్షాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం అందించి, పట్టు వస్త్రాలతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ గోశాలను సందర్శించిన గవర్నర్ దంపతులు గోవులకు గ్రాసం తినిపించి గోపూజ నిర్వహించారు. భారతీయ సనాతన సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన గోసేవలో పాల్గొని తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఆలయ కార్యనిర్వహణాధికారి సునీత, ఆలయ ప్రధాన అర్చకులు శేషు, సంబంధిత అధికారులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



# ముదురుతున్న వివాదం

- కొండా సురేఖ వర్సెస్ కడియం శ్రీహరి
- విలువలు తెలిసిన వాడైతే రాజీనామా చేసి మళ్లీ గెలవాలన్న మంత్రి
- బిడ్డను కాంగ్రెస్ నుంచి గెలిపిస్తవు.. నీవేమో బీఆర్ఎస్ ఎమ్మెల్యేను అంటావని విమర్శ
- తప్పు ఒప్పుకోవాల్సింది పోయి ఎదురుదాడికి దిగటమా?
- తాడోపేడో తెల్చుకుంటానన్న కొండా సురేఖ
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ కూ ఫిర్యాదు
- హాట్ టాపిక్ గా తాజా వరస పరిణామాలు



అక్షరదర్బార్, వరంగల్ : తెలంగాణ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరిల మధ్య వివాదం తీవ్రరూపం దాలుస్తోంది. పరస్పర విమర్శలతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. తాజాగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీరుపై మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మొదటి నుంచి ఆయన బుద్ధి ఇలాగే ఉంటుందని, గతంలో మంత్రిగా పనిచేసిన కడియం.. ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యేగా ఇమడలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. పదవికి రాజీనామా చేసి నోర్మూసుకుని ఇంట్లోనైనా కూర్చోవాలని, లేదా దమ్ముంటే మళ్లీ గెలిచి మంత్రి పదవి తెచ్చుకోవాలని సవాల్ విసిరారు. నన్ను బ్లేమ్ చేయాలనుకున్నా, జిల్లాను డిస్టర్బ్ చేయాలనుకున్నా ఊరుకునేది లేదని హెచ్చరించారు. తన శాఖకు సంబంధించిన దేవాదాయ అంశాలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏకపక్షంగా సమీక్షా సమావేశం నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. నేడు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను కూడా కలిసి కొండా సురేఖ ఫిర్యాదు చేశారు.

**బిడ్డను కాంగ్రెస్ ఎంపీ చేసి.. తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని చెప్పుకుంటారా?**

కడియం శ్రీహరి నైతికతపై మంత్రి కొండా సురేఖ తీవ్ర ప్రశ్నలు సంధించారు. ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని చెప్పుకుంటున్నాడు.
బిడ్డను కాంగ్రెస్ కండువా కప్పుకుని ఎంపీగా గెలిపించాడు. నిజంగా నిజాయితీపరుడు, విలువలు తెలిసిన వాడు అయితే ఆయన రాజీనామా చేసి మళ్లీ గెలవాలి. మా హస్బెండ్ ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో మేము వైఎస్సార్సీపీకి వెళ్లినప్పుడు ఆయన రాజీనామా చేసేశాడు. మళ్లీ మేము కాంగ్రెస్ లోకి వచ్చినప్పుడు బీఆర్ఎస్ వాళ్లు ఇచ్చిన ఎమ్మెల్సీ పదవి కాలం మరో నాలుగేళ్లు ఉన్నప్పటికీ మా ఆయన రాజీనామా చేశారు. అదీ విలువలు అంటే. నీకు కూడా విలువలు ఉంటే.. నువ్వు కూడా రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ జెండా మీద మళ్ళీ గెలిచి అప్పుడు నేను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేనని చెప్పు. నీ బిడ్డను కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా గెలిపిస్తావ్. నేనేమో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న అని అంటావు అని విమర్శించారు. ప్రతిపక్షాల చేతికి ఆయుధం ఇవ్వకూడదనే, పార్టీపై మచ్చ రాకూడదనే తాను రియాక్ట్ అయ్యానని.. తన ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని పీసీసీ చీఫ్ హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే, ఈ నెల 14న మీనాక్షి నటరాజన్ కూడా రాష్ట్రానికి రాబోతున్నారని, అప్పుడు ఈ విషయంపై మాట్లాడతామని చెప్పినట్లు పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు పార్టీకి, ప్రతిష్టకు దెబ్బతీస్తాయని, అందుకే ఆదిలోనే అడ్డుకునేందుకు మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు.

**పీఆర్వో మినిట్స్‌లోనే అన్నీ ఉన్నాయి..**

దేవాదాయ శాఖ అధికారులతో కడియం శ్రీహరి సమీక్ష నిర్వహించినట్లు ఆయన పీఆర్వో ప్రెస్‌కు రిలీజ్ చేసిన మినిట్స్‌లోనే స్పష్టంగా ఉందని కొండా సురేఖ ఆరోపించారు. "కార్యాలయంలో అధికారులతో గంటన్నర సేపు సమీక్ష నిర్వహించి, ఆలయ భూములు కాపాడాలని, ఆలయాలకు డీపీఆర్‌లు సిద్ధం చేసి ఒక నెలరోజుల్లో సమర్పించాలని కమిషనర్‌ను ఆదేశించినట్లు ప్రెస్ నోట్ ఇచ్చారు. కమిషనర్ ఛాంబర్‌లో ఇదంతా జరిగి ఉంటే నేను ఎలాంటి అభ్యంతరం చెప్పేదాన్ని కాదు." కానీ మీటింగ్ హాల్‌లో మంత్రి, కమిషనర్ కూర్చునే స్థలంలో ఆయన కూర్చుని, ముందు స్టాఫ్‌ను కూర్చోబెట్టుకుని ఆదేశాలు ఇస్తే ఎలాంటి సంకేతాలు వెళ్తాయని సురేఖ ప్రశ్నించారు. మినిస్టర్ స్థాయిలో రివ్యూ తీసుకునే అర్థం వెళ్తోందనే తాను అభ్యంతరం చెప్పానని, అంతే తప్ప తాను ఆ కార్యాలయానికి వెళ్లొద్దని అనలేదన్నారు. సామాన్య కార్యకర్త కూడా కమిషనర్ వద్దకు, ముఖ్యమంత్రి వద్దకు వెళ్లొచ్చని స్పష్టం చేశారు. కమిషనర్ ఛాంబర్‌లో కాకుండా మీటింగ్ హాల్‌లో రివ్యూ చేసిందే కాకుండా, మళ్లీ మామీదే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని కడియంపై మండిపడ్డారు. శ్రీహరి రాకముందు పార్టీలో అంతా సవ్యంగా ఉందని, ఆయన రావడంతోనే ఇవన్నీ జరుగుతున్నాయని దుయ్యబట్టారు. రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ అన్నీ తెలిసిన కడియం, తప్పు ఒప్పుకోవాల్సింది పోయి ఎదురుదాడికి దిగడం కరెక్ట్ కాదన్నారు. కడియంతో తాడోపేడో తెల్చుకుంటానని మంత్రి కొండా సురేఖ తేల్చిచెప్పారు.

# రూ.320 కోట్లతో చెక్ డ్యామ్ లు

- గ్రామాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

అక్షరదర్బార్, భూపాలపల్లి: గ్రామాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఐడిఓసి కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు అంశంపై చిట్యాల, కొత్తపల్లిగోరి, రేగొండ, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన అవగహన సదస్సును జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు, ప్రజలకు ఉపయోగపడే ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీలు ఆదాయ వనరులు సొంతంగా సమకూర్చుకోవాలని సూచించారు. గ్రామాల నుంచి దేశ, విదేశాల్లో నివసిస్తున్న ప్రముఖుల ద్వారా గ్రామాలు అభివృద్ధికి నిధులు సమకూర్చుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు పోటీతత్వంతో కృషి చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా వస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రూ.320 కోట్లతో మోరంచపల్లి



వాగుపై చెక్ డ్యామ్ లు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పంట కాలువలు సిమెంట్ లైనింగ్ కొరకు రూ.55 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. డీటీఎం 38 ద్వారా 44,700 ఎకరాలకు సాగునీరు అందించేందుకు డీపీఆర్ సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సర్పంచులు లీడ్ తీసుకోవాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి మొదటి, రెండు, మూడు సంవత్సరాలకు ప్రణాళికలు తయారు చేయాలని, అట్టి ప్రణాళిక సంవత్సరం వారీగా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామ, మండల ప్రణాళికలు కనుగుణంగా జిల్లా స్థాయి ప్రణాళిక తయారు చేయనున్నట్లు తెలిపారు. మిషన్ భగీర ద్వారా మంచినీటి సరఫరా చేయాలని ఎక్కడైనా నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైనట్లయితే ప్రత్యామ్నాయంగా మంచినీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మంచినీటి సమస్య ఎట్టి పరిస్థితిలోను నీటి ఎద్దడి రావోద్దని స్పష్టం చేశారు. తడి, పొడి వ్యర్థాలు నిర్వహణ 16 ఆర్థిక సంఘం నిధులు వినియోగం పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. గ్రామాల నుండి అభివృద్ధి జరగాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధికి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఇట్టి శిక్షణ కార్యక్రమాలను వినియోగించి గ్రామాలు అభివృద్ధిని సాధించాలని సూచించారు. జిల్లాలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఆ కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతను బట్టి మొదటి, రెండవ, మూడు సంవత్సరాల్లో పరిష్కరించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, ఆయా మండలాల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.